
# సాయి దర్శన్



తూములూరు కృష్ణమూర్తి

# సాయి దర్శన్

తూములూరు కృష్ణమూర్తి

# నీ వెవరు?

ఒక రోజు రాత్రి నా కలలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు నాకు తిరువనంత పురంలోని అనంత పద్మనాభ స్వామిగా, శ్రీరంగంలోని రంగనాథస్వామిగా, తిరుపతిలోని గోవిందరాజు స్వామిగా, దర్శనమిచ్చి, వీరందరి నాభి దగ్గర కుర్చుని దర్శనమిచ్చారు. **"ఎవరు మీరు?"** అని నేను ప్రశ్నించగా.... **"నీ వెవరు?"**.... అని ఎదురు ప్రశ్నిస్తు న్నట్లుగా..నా ఆలోచనా తరంగాలుగా... పదముల రూపంలో ... నాహృది నుండే ప్రతిధ్వనించారు, స్వామి:

సూర్యునిలోని కాంతి నీవు
చంద్రునిలోని వెన్నెల నీవు
చిదగ్నిలోని జ్యోతి నీవు
అసలు
కాంతే నీవు
వెన్నెలే నీవు
జ్యోతే నీవు.

వేద బ్రహ్మము నీవు
వేద మాతవు నీవు
వేద శాస్త్రము నీవు
వేద ఋక్కువు నీవు
వేద మంత్రము నీవు
అసలు
వేదమే నీవు.

శబ్ద బ్రహ్మము నీవు
ఓంకారమే నీవు.
శబ్ద శాస్త్రము నీవు
అసలు
శబ్దమే నీవు.

కాల స్వరూపుడవు నీవు
కాల రుద్రుడవు నీవు
కాల భైరవుడవు నీవు
కాలా తీతుడ వీవు
అసలు
కాలమే నీవు.

పలికించేది నీవు
పాడించేది నీవు
వ్రాయించేది నీవు
వినిపించేది నీవు
అసలు
పలుకే నీవు
పాటే నీవు
వ్రాతే నీవు
వినుటే నీవు.

మాతవు నీవు
పితవు నీవు
గురువు నీవు
భ్రాతవు నీవు
భ్రాత్రి నీవు
సర్వము నీవు
సర్వాంతర్యామి నీవు.

విద్య నీవు
అవిద్య నీవు

జ్ఞానము నీవు
అజ్ఞానము నీవు
సుజ్ఞానము నీవు
విజ్ఞానము నీవు.

తమస్సు నీవు
రజస్సు నీవు
సత్త్వము నీవు
గుణము నీవు
గుణాతీతుడ వీవు

అంతేకాదు, స్వామివారు, నన్ను తమ నుండి వేరుగాకాక " నీవే నేను – నేనే నీవు" అను అవగాహన నాలో స్పష్టంగా కలుగురీతిలో.....నాలో రసస్ఫోరక మైన భావాభినివేశము పదముల రూపంలో అభివ్యక్తవగునట్లు అనుగ్రహించారు.

## నీవు – నేను

ప్రకృతి నేను
పురుషుడ వీవు
ఆత్మ నేను
పరమాత్మ నీవు
సృష్టి నేను
సృష్టి కర్త వీవు
రాధను నేను
కృష్ణుడ వీవు

ఆత్మవు నీవు
ఆత్మజ నేను
అమృతము నీవు
అమృతపుత్రుడ నేను.
నేనెవరు? నీవెవరు?
నేనే నీవు, నీవే నేను
ఇమిడి పోయెదను నీలో
ఐక్యమొందించుకో నన్ను నీలో.

# సాయి దర్శన్

భగవాన్ శ్రీ సత్యసాయీశ్వరుల 50వ జన్మదిన వేడుకల సందర్భంగా నవంబరు 4 మొదలు 28 వరకు 'పర్తి'లో వుండి, అక్కడి విషయాలను అవలోకిస్తూ, ఆనందంతో ప్రతిరోజూ పలుమార్లు స్వామి దర్శనం చేసుకుంటూ, సాయి సాహిత్యము, సూక్తులు, దివ్యవాణి, వాహినులు చదువుకుంటూ గడుపుతున్న రోజుల్లో, ఆంగ్లంలో వెలువడిన **'సాయి అవతారము'** అన్న చిన్న పుస్తకం ఒకదాన్ని చూచి, దాన్ని అనుసరిస్తూ, రెండవ భాగంగా రచన చెయ్యాలనిపించి కొన్ని పుస్తకాల నుండి స్వామివారి దివ్యసూక్తులు ఆంగ్లంలో సేకరించ నారంభించాను. అలా సేకరిస్తున్న తరుణంలోను, ఆ తరువాతనూ - స్వామి అనుగ్రహంవల్ల అనేక రకాలైన అనుభూతులతో కూడిన భజన, నామావళి, పద్యములు, వేదాంత విషయాలు నా మదిలో స్ఫురించడంతో - వాటిలో కొన్నింటినిఅక్షర రూపంలో పొందుపరచి, నా తోటి సాయి కుటుంబ సోదర సోదరీమణులకు అందించాలనే అభిలాషతో ఈ క్రింది విధంగా పొందుపరుస్తున్నాను. శ్రీసాయి దర్శన స్పర్శన సంభాషణలతో అందరూ 'ప్రశాంతి'నీ, ఆనందాన్నీ అనుభవించుదురు గాక అని, ఆ పరమాత్ముని ప్రార్థిస్తున్నాను!

**త్రినేత్రధారిగా :**

ఓ రోజు సాయంత్రం ఏదో వ్రాసుకుంటూ మా దంపతులం కూర్చుని వుండగా...

సాయీ శంకర సదాశివా
హరహర మహాదేవ
గౌరీ శంకర సదాశివా
హరహర మహాదేవ

...అని స్ఫురింపగా - 'స్వామీ! ఈ తరువాత ఏమిటి? వీటి తాత్పర్యం ఏమిటి' అంటూ నా ఎదుట వున్న శ్రీ పద్మావతీ వెంకటేశ్వరుల చిత్రపటాన్ని వీక్షిస్తూ కన్నులు మూయగా, చిత్రాతి చిత్రమైన ముక్కంటి మూడవ కన్ను దర్శన భాగ్యం కలిగింది. వెను వెంటనే...

త్రినేత్రధారీ సదాశివ
హర హర మహాదేవ
త్రిగుణాతీతా సదాశివ
హర హర మహాదేవ
పార్వతి శంకర సదాశివ
హర హర మహాదేవ

పర్తి పురీశా సదాశివ
హర హర మహాదేవ
॥ సాయీ శంకర ॥
అని స్వామి పూర్తి చేశారు.

**సూర్యుడుగా :**

బ్రహ్మ ముహూర్తంలో ఓంకార సుప్రభాతాలకు ఓ రోజు కూర్చుండగా స్వామి చిత్రపటంలో సూర్యతేజస్సు కన్పించి –

సూర్యతేజ సాయి అవతార
చంద్రకాంతిమయ సాయి
అవతార
దశ విధరూప సాయి అవతార
ప్రేమ రూపమయ సాయి
అవతార

***'అన్ని తేజస్సులు, అన్ని అవతారాలు నేనే'*** అన్నారు.

**శివ కేశవులుగా :**

1976 గురుపూర్ణిమకు మా మిత్రులు జిందాల్ దంపతులతో కలిసి మా దంపతులం బెంగుళూరు నుంచి పుట్టపర్తికి మధ్యాహ్నపు వేళ కార్లో ప్రయాణం చేస్తూవుంటే దారిలో డ్రైవర్ తన వ్యక్తిగత చికాకులతో కారును పెను వేగంతో దుడుకుగా నడుపుతూ, మా ప్రాణాలను ప్రమాదపు అంచుల్లోకి నెట్టగా, ఓ గోధుమ వర్ణపు త్రాచు పాము రోడ్డుకు ఓ వైపు నుంచి మరో వైపుకు దాటుతూ మా కారుకి అడ్డురావటంతో, డ్రైవర్ వేగం తగ్గించి, కారు ఆపాడు. అంతటితో మా ప్రాణాలు కుదుట పడ్డాయి. ఆ క్షణంలో మమ్మల్ని రక్షించి కాపాడినది సాక్షాత్తూ భగవాన్ బాబావారే నని మాకు గ్రహింపైంది. 1977 శివరాత్రికి మా దంపతులం మళ్ళీ అదే దారిలో కారులో ప్రయాణిస్తుండగా, గత సంవత్సరం గోధుమ త్రాచు ఎక్కడ తారస పడిందో సరిగ్గా అక్కడికి రాగానే, నాలో నుండి భక్త్యావేశం పెల్లుబికి, అలవోకగా నా నోటవెంట వెలువడిన ప్రార్థనా గీతాన్ని నా శ్రీమతి ప్రభ అక్షరబద్ధం చేశారు. అదే ఈ క్రింది భక్తి గీతం....

పన్నగ భూషణ హర శివశంకర
పన్నగ శయనా నారాయణ
నీలకంఠ హర శివ శివ శంకర
నీలాంబర ధర నారాయణ
పార్వతి శంకర పర్తీ శంకర
అంబుజనాభా నారాయణ
హిమగిరిశంకర, గిరిజా శంకర
(సాయి)లక్ష్మీరమణానారాయణ

శివకేశవులకు బేధం లేదని స్వామి ఆ భజనను ఈ క్రిందివిధంగా పూర్తి చేయించారు.

అల్లా యంచు మహమ్మదీయులు
జహోవా యంచు సత్క్రైస్తవుల్
పుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు
శంబుండంచు శైవుల్ సదా
ఉల్లాసంబున గొల్వ నెల్ల
నాయుర్భోగ భాగ్యాది సంపల్లాభంబు
లొసంగి బ్రోచు పరమాత్ముండొక్కడే
చూడుడీ!

"ఏకం సత్ విప్రా బహుదావదంతి".

"సర్వదేవ నమస్కారం కేశవం ప్రతి గచ్ఛతి".

"శివాయ విష్ణు రూపాయ శివ రూపాయ విష్ణవే".

విష్ణువే గొప్పని వైష్ణవులనుచుండ
శంభుండు గొప్పని శైవులనగ
గణపతి గొప్పని గాణపత్యులన
శారద గొప్పని చదువరులన
అల్లా ఘనుండనుచు అల్ల
తురకలు చెప్ప
క్రీస్తుయే గొప్పని క్రైస్తవులన
బుద్ధుడే గొప్పని బౌద్ధులనుచుండ
మహావీరుడే గొప్పని జైనులనగ
జోరాష్ట్ర గొప్పని పారశీలు చెప్ప
నానక్ గొప్పని సిక్కులనగ
సాయియే గొప్పని బాబా భక్తుల్ చెప్ప
అందరొక్కడే యని కొందరనగ
సర్వమతసమ్మతుడైన దేవుడొక్కడే
అతడే సత్యము, అతడే ధర్మము
అతడే శాంతి, అతడే ప్రేమ.

## రమ్, రామ్:

పర్తిలో స్వామి దర్శనం చేసుకొని బెంగుళూరు నుండి విమానంలో కలకత్తా తిరిగి వస్తూండగా సహ ఉద్యోగి, స్నేహితుడు రామదాసు రమ్‌ని సీసాలోంచి పోసుకొని సేవిస్తుంటే...

"స్వామీ ఇది యేమి? ఆ రామునే నేను సేవించెద" ననగా...

కళ్యాణరామ కారుణ్య రామ
పతితోద్ధారక ప్రశాంతి రామ
॥ పతితో ॥
కౌసల్యరామ కైవల్యరామ
॥ పతితో ॥
అయోధ్యరామ ఆనందరామ
॥ పతితో ॥
వైకుంఠ రామ వైదేహి రామ
॥ పతితో ॥

...అని స్ఫురింపజేసి...ఆ ప్రశాంతి రాముడు ఆనంద బాష్పాలతో ఆ విధంగా కొలుచుకునేటట్లు చేశాడు.

**మాత, పిత, గురు, బంధు :**

మా అమ్మ అనసూయ చనిపోయిన చాలా సంవత్సరాల తర్వాత రెండు రోజులు వరుసగా ఆమె నవ్వుతూ నా కలలో కన్పిస్తే, 'ఏమైవుంటుంది?' అని ఆలోచిస్తున్న సుప్రభాత సమయంలో....

త్రిమూర్తి రూపా దత్తాత్రేయ
త్రిలోక పూజిత దత్తాత్రేయ
అనసూయాత్మజ దత్తాత్రేయ
ఆనందరూప దత్తాత్రేయ
పర్తిపురీశా దత్తాత్రేయ ॥

...అనే పదగానంతో అనసూయాత్మజునిగా కొలిపించుకున్నాడు!

నేను పర్తిలో దర్శన స్పర్శన సంభాషణలతో వుండగా మా నాన్నగారు కీ.శే॥ శ్రీ రామజోగేశ్వరశర్మ గారు కలకత్తాలో చనిపోయారని తెలిసినా, ఏ మాత్రం బాధపడకుండాచేసి, తల్లి బిడ్డను ఏవిధంగా ఓదారుస్తుందో చవిచూపించి, నిదురిస్తున్న వానిని లేపి సుప్రభాతం పలికించారు, స్వామి...

జోగేశ్వర స్వామి దయాకరో
దయాకరో హే కృపాకరో
॥ జో ॥
హే కరుణా సింధూ రామ్
హే దీన బంధు సాయిరామ్
రామేశ్వర సాయి దయాకరో
॥ జో ॥
హే పతిత జనావన రామ్
హే పర్తి పురీశ్వర రామ్
దయాకరో దయాకరో
దయాకరో సాయిరామ్
॥ జో ॥
(రామ జోగేశ్వర స్వామి దయాకరో)

గురుపూర్ణిమకు గురువు, సచ్చిదానంద మూర్తి, త్రిమూర్తి అన్నీ నేనేనని గుర్తు చేస్తూ –

సచ్చిదానందా సద్గురుదేవా
బ్రహ్మ విష్ణు మహేశ్వరా
॥ బ్ర ॥
శ్రీ సాయినాథా సద్గురు దేవా
॥ బ్ర ॥
జ్యోతి స్వరూప శ్రీ సాయినాథా
॥ బ్ర ॥
త్రిగుణాతీత సాయిగురు దేవా
॥ బ్ర ॥

**జీవన బంధు – జీవన జ్యోతిగా :**

జీవన బంధు జీవన జ్యోతిగా
జన్మ జన్మకీ జీవన బంధో
జీవన దాత జగదోద్ధార
జగదభిరామ జానకి రామ
జానకి జీవన జయ జయ రామ
జయ జయ రామ జయ
సాయిరామ
జీవనజ్యోతి జయ సాయిరామ

స్వామి ఎప్పుడూ చెపుతూ వుంటారు – భగవంతుడు త్రికాలజ్ఞుడు. మానవునకు వర్తమానమే తెలుస్తుంది. గతం జ్ఞాపకం వుండదు. అదీ అదృష్టమే! ఎందుచేతనంటే, నీ పూర్వజన్మల తాలూకు తల్లిదండ్రులు, పత్నీసుతులు ఎందరో వుంటారు. వీరందరూ జ్ఞాపకం వున్నట్లయితే ఎంతో బాధ కలుగుతుంది. అందుచేత జన్మ జన్మకీ స్వామియే నీ జీవన బంధువు, నీ జీవన దాత మరియు నీ జీవన జ్యోతి.

## సుందరేశ్వరి

మధురలో సోమవారంనాడు అమ్మవార్ని అన్ని నగలతో అలంకరిస్తారు. ఆ రోజు దేవాలయం తలుపులు వేసే ముందు చివరగా దర్శనము కలుగజేసి, ఈ విధంగా వర్ణించుచూ, కరుణింపుమని వేడుకొనగా...

సుందరేశ్వరీ సుందరవదనీ
మీనాక్షీ మధుర నివాసిని...
పరమపావనీ పతిత జనావని
పర్తినివాసిని సాయీ జననీ
కరుణాసాగరి కైవల్య దాయిని
కరుణింపవే మధురనివాసిని॥

...అని మదిలో పలికించారు, స్వామి!

## రాధా రమణ గోపాలుడు :

గురువాయూర్‌లో సుప్రభాత సమయమున, ప్రత్యక్ష దైవమైన స్వామి తన దివ్యదర్శనము ప్రసాదించి, ఒక యిరువది నిముషలు తన్మయత్వముతో ఒడలు మైమరచునటులచేసి, స్వామి యీ విధముగా తమను కొలిపించుకొన్నారు...

రాధారమణ గోపాల్,
గోపాల్, రాధారమణ గోపాల్
వసుదేవనందన రాధా జీవన ॥
రాధా రమణ గోపాల్
గోపాల్ రాధా రమణ గోపాల్
యదుకుల భూషణ యశోద
నందన ॥
రాధా రమణ గోపాల్
గోపాల్ రాధా రమణ గోపాల్,
పవన పురీశ పండరినాథా
పర్తి పురీశ గోపాల్, గోపాల్,
రాధారమణ గోపాల్
పండరి నాథా పరమ దయాళా
పవన పురీశ గోపాల్, గోపాల్
రాధా రమణ గోపాల్....

...ఆ దర్శనము యిప్పటికీ నా కన్నుల ముందు కట్టినట్లుగా కనబడుతున్నది!

## నను గన్న తల్లి

మా ఇంట్లో మొదటిసారి భజనరోజున భజన చేసేందుకు గాయకులు రాలేదు. నేను గానం చేయలేను. వాకిలివద్ద దీన వదనముతో నిలబడి...

నను గన్న తల్లి ఆనంద రూపిణి
అభయ ప్రదాయిని కరుణాసాగరి॥

నను గన్న తల్లి జ్ఞాన స్వరూపిణి
మోక్ష ప్రదాయిని కరుణాసాగరి॥

నను గన్న తల్లి సాయి నారాయణి
పర్తి నివాసిని కరుణాసాగరి॥

కరుణింపవే అంబభవానీ
నను గన్న తల్లి ఆనందరూపిణి
అభయ ప్రదాయిని కరుణాసాగరి॥

....అంటూ ప్రార్థించగా గాయకులు, భక్తులు వచ్చారు. ఆ రోజున భజన బ్రహ్మాండంగా జరిగింది.

## ఉయ్యాలలూగవయ్యా :

స్వామి జన్మదినోత్సవ సందర్భంలో భక్తులు ఉయ్యాలలూపుతూ పాడుతుం-డగా... ఆ దర్శన సందర్భాలలో... నా మదిలో సాగిన ఉయ్యాల పదాలు...

ఊగుము ఉయ్యాల గోపాల
భక్తకోటి ఊపేదు ఉయ్యాల
నంద యశోదల కన్నుల పండుగ
భూలోకమున వెలసిన అవతార
కలియుగ అవతార సాయిగోపాల
భూలోక వైకుంఠ పర్తి నివాసా ॥

వైకుంఠపుర నివాస శ్రీ శ్రీనివాసా
లక్ష్మీనారాయణ ఊగుము ఉయ్యాల

పర్తీపుర నివాస శ్రీ సాయినాథా
ప్రేమావతార ఊగుము ఉయ్యాల

శ్రీరంగపుర నివాస శ్రీ రంగసాయి
ఊగుము ఊయ్యాల

తిరుమల పురవాస
శ్రీపద్మావతీప్రియ
ఊగుము ఉయ్యాల ॥

జో అచ్యుతానంద జోజో ముకుందా
లాలి పరమానంద రామ గోవిందా

పదునాల్గు భువనాలు బొజ్జలోనుండ
పవళింపుమో అయ్య పర్తీ నివాసా॥

క్షీరసాగరశయన శయనింపుమో అయ్య
శేషపానుపు పైన శేషసాయిగ నీవు॥

**హృదయ నివాసి :**

కురువృద్ధులు, పితామహులు, గురువులు ఆశీనులైవున్న నిండు సభలో ద్రౌపదికి పంచభర్తలున్నా, అనాథవలె మానభంగము కాకుండా కాపాడు కొనుటకు ప్రయత్నించి, చివరకు తన వశము కానప్పుడు, ఆ శ్రీ కృష్ణపరమాత్మ అనాథనాథుడు, దీనబాంధవుడుగా ఆమెను కాపాడతాడు.

కొంతకాలం తర్వాత ద్రౌపది, "'కృష్ణా' పిలిచితే పలికేవాడివి, ఎందుకు స్వామీ ఆనాడు ఆలశ్యం చేశావు?" అని అడిగితే, "ఏమని పిలిచావు? ఎక్కడి నుంచి పిలిచావు? అంతదూరం నుండి వచ్చుటకు ఆలశ్యం కాదా మరి?" అంటూ ఛలోక్తిగా అంటాడు కృష్ణ పరమాత్మ. ఆ దృశ్యం నా మనస్సున మెదిలినప్పుడు....వెలువడిన పద్యగాన తరంగిణి....

ద్వారకవాసా దయానిధే
పరమ దయాళూ కృపానిధే
॥ ద్వా ॥
దర్శన దీజో కృపానిధే
గోకులవాసా దయానిధే
॥ ద్వా ॥
పరమదయాళూ దయానిధే
మధుర నివాసా దయానిధే
॥ ద్వా ॥
దర్శనదీజో దయానిదే
॥ ద్వా ॥
పరమ దయాళూ దయానిధే
పరమ కృపాళూ దయానిధే
దర్శన దీజో దయానిధే
హృదయ నివాసా దయానిధే
॥ ద్వా ॥

**ప్రేమావతార :**

సాయి సృష్టి స్థితి లయ కారక
కర్మ భక్తి జ్ఞాన సార ॥ సాయి ॥
నిత్య సత్య నిర్మల ప్రేమావతార
॥ సాయి ॥

(మూలము సత్యసాయి స్పీక్స్
సంపుటం 4, పే॥97)

**రా! పరీక్షించు :**

ఒకసారి స్వామి దర్శనము కోసం నేను 'పర్తి'కి వెళ్ళినప్పుడు, స్వామి కొంత మంది భౌతిక శాస్త్రజ్ఞులకు ఇంటర్వ్యూ ఇస్తుండగా, వారికి స్వామి ఏమి చెప్పి వుంటారో నని నాలో నేను ఊహించు కొన్నప్పటి నా తలపులు అక్షర రూపంలో..

ముక్కోటి దేవతలు మునుముందుగా
వచ్చి
సాయిదర్శనము కొరకు వేచియుండ
భౌతిక శాస్త్రజ్ఞులు, బహురూపధారి
ఆది అంతము లెరుగక కాచి యుండ
ఆదిమధ్యాంత రహితుడైన శేషసాయి
అవనిపై అవతరించి,
**"ప్రేమతో నన్ను తెలుసుకొనుడు**
**భక్తితో నన్ను బంధించుడ**"నెను.

**పారద్రోలుము :**

పారద్రోలుము నీ హృదయమందు
వసించు అరిషడ్ వర్గములను
నవవిధ భక్తిమార్గ ధ్యానసాధనలతో
అర్పింపు నీ హృదయ కమలమున్
స్వామికి పరిపూర్ణ ప్రేమతో
కొలువుము నీ హృదయాంతరంగమున
నివసించు రమణీయ సుందరసాయిని
పాడుము ప్రేమతో శ్రీ సత్యసాయి
సత్ చరిత్ర

**మొరవిను :**

వినవయ్య ఓ రామ నా మొర
విన్నపమాలించు మయ్యా ఓరామ
వివరించలేను నా వ్యధను
విజ్ఞాన వైరాగ్య వివేకముల నొసగి
కరుణింపుమయ్యా ఓ రామ
ధన ధాన్యము లాశించలేదు
నీ చరణ దాస్యమే వేడుకొంటిని రా
రామ
కరుణింపుమయ్యా ఓ రామ ॥

**పాలించు :**

ఏమని వేడుకొందురా రామ శ్రీరామ
శ్రీ సత్యసాయిరామ
ఏమని మొరలిడుదురా రామ శ్రీరామ
శ్రీ సత్యసాయిరామ
ఆలించి పాలించి పోషించుమురా
రామ శ్రీరామ
శ్రీ సత్యసాయి రామ
శ్రీరామ జయరామ
శ్రీ సత్యసాయిరామ

దయజూడర దయగనర
దయాబ్ధివని, కృపాబ్ధివని
నెరనమ్మితిర రామ శ్రీరామ
శ్రీ సత్యసాయి రామ ॥

**పాదుకా పట్టాభిషేకము :**

కాంక్షించలేదు
భౌతిక దేహ సుఖములన్
ఆశించలేదు భోగభాగ్యములన్
కోరితినే నీ పాదయుగములన్
వేడుకొంటినే నీ అపార కరుణన్

॥ జై శ్రీ సాయిరామ్ ॥

# గేయాలు

- తూములూరు కృష్ణమూర్తి

## యశోద

బంధింపలేవు స్వామిని
యశోదమ్మ బంధింపలేవు
బంధింపలేవు యశోదమ్మ
స్వామిని
త్రాటితో బంధింపలేవు.
దొరకదు నీకు స్వామి
బంధించుటకు త్రాటితో
యశోదమ్మ బంధింపలేవు.
విడువవమ్మా అహంకారము
వదలవమ్మా రాగానురాగము
వెదకవమ్మా స్వామిని
ధర్మనిష్ఠ బ్రహ్మనిష్ఠలతో
చిట్టడుగులు చిన్నారి అడుగులు
స్వామి అడుగు మడుగులలో
వెదుకమ్మా
భక్తి ప్రేమలతో బంధింపవమ్మ
స్వామిని
నీ హృదయమందు
॥ బంధింపలేవు యశోదమ్మ ॥

## నరజన్మ

నరజన్మ దుర్లభమురా సోదరా
॥ సోదరా నర ॥
జన్మలనింటిలో నరజన్మ
దుర్లభమురా
వేదశాస్త్రములు ఘోషించు
నరజన్మ దుర్లభమురా
॥ సోదరా నర ॥
భోగభాగ్యములు క్షణభంగురమురా
సోదరా నరజన్మ దుర్లభమురా
॥ సోదరా నర ॥
ఎంత పుణ్యమో నరుడై పుట్టితివి
సకల సాధనలకు రాదారి మార్గము
నరజన్మ మోక్ష ద్వారమురా
॥ సోదరా నర ॥
సంసార సాగరము దాటుటకు
సులభమార్గము భక్తిమార్గమురా
॥ సోదరా నర ॥
సర్వ ప్రాణులలో ఆత్మస్వరూపుడై
వున్నమాధవుని సేవించరా
॥ సోదరా నర ॥

## సాంగత్యము

విడువుమయ్య దుర్జనుల
సాంగత్యము తమ్ముడా!
వదలవయ్య కామక్రోధాదులు
సకల గుణ సంపన్నుడైన
పరమాత్ముని సేవింపుమయ్య
॥వి॥

జ్ఞానవిజ్ఞాన వైరాగ్య సంపన్నుడైన
ఆత్మస్వరూపుడే పరమాత్ముడని
గ్రహింపుమయ్య తమ్ముడా
అట్టి సత్పురుషుల సాంగత్యమే
మేలు నీకు
విడువుమయ్య దుర్జనుల
సాంగత్యము తమ్ముడా
విహరించుమయ్య సదా
భగవద్భజనలో తమ్ముడా ॥వి॥

## మురళీ

పలుకవే మురళీ
రాగసుధా రసవాహిని ॥ ప ॥

తెలుపవే నీ అనుభవ జ్ఞానము
రాగసుధా రసవాహిని
కరుణారస సాగరుని చేరుమార్గము
తెలుపవే మురళీ ॥ ప ॥
వినవే భామా! కరుణారస సాగరుని
చేరు మార్గము ॥ వినవే ॥
విడువవే కామ క్రోధ రాగాను
రాగముల్
వదలవే లోభ మోహ మద
మాత్సర్యముల్
కొలువవే స్వామిని పరిపూర్ణ ప్రేమతో
కరుణారస సాగరుని చేరు మార్గము
॥ వి ॥

## బాలగోపాలకృష్ణ

చతుర్భుజ శంఖ చక్ర పద్మ గదాధర
కస్తురి తిలక కౌస్తుభ మణిధర
మకర కుండల పీతాంబర ధర
అంబుజ నయన ఆముక్తాలంకార
నవరత్న ఖచిత సువర్ణ కిరీట
మయూర ముకుటధర
శ్రీ బాల గోపాలకృష్ణ
నమస్తే నమస్తే నమస్తే నమః

## శ్రీరామచంద్ర

కనకాంబర కేయూర
మకర కుండల ధర
శ్రీరామచంద్ర ప్రభు
నమో నమో ॥
కోటి మన్మధ లావణ్య
నవ సుందరాకార
శ్రీరామచంద్ర ప్రభు
నమో నమో ॥
సర్వాలంకార రమణీయ
కోమల సీతా మనోహర
శ్రీరామచంద్ర ప్రభు
నమో నమో ॥

## :: రచయిత గురించి ::

శ్రీ తూములూరు కృష్ణమూర్తిగారు కలకత్తాలో (నేటి 'కోల్‌కొటా'లో) ప్రఖ్యాత బహుళ జాతీయ వాణిజ్య సంస్థ యైన "బ్రూక్‌బాండ్ ఇండియా లిమిటెడ్" లో "కంపెనీ సెక్రెటరీ"గా ఉన్నతోద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే, స్థానిక ప్రవాసాంధ్ర సంఘంలో వివిధ స్థాయిలలో బాధ్యతాయుత కార్యకర్తగా పలురీతుల సేవలందించారు. ప్రవాసాంధ్ర సంఘ భవన ట్రస్టుకు మేనేజింగ్ ట్రస్టీగా సంఘ దైనందిక కార్యకలాపాల్లో క్రియాశీలక పాత్ర వహించారు. సహజసిద్ధంగా లలితకళలలో చక్కటి అభినివేశం గల శ్రీ తూములూరు కృష్ణమూర్తిగారు ఉద్యోగ పదవీ విరమణ అనంతరం, హైదరాబాద్ నగరంలో స్థిరనివాసియై, వారి సతీమణి శ్రీమతి తూములూరు ప్రభగారితో కలిసి, వారి కుటుంబ దైవము, వారి "జీవన రథసారథి" యైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారిని భక్తితో కొలుస్తూ, ఆ దివ్యావతారి ప్రసాదించిన స్ఫూర్తి, ప్రేరేపణలతో, ఆ కలియుగ ప్రత్యక్ష దైవంపై పలు గ్రంథాలను సంకలనము గావించి, సాయి చరణారవిందాలకే అంకితం చేసిన ధన్య జీవులు – ఈ ఆదర్శ దంపతులు!